డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

అంబర్‌పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానికులను వేధిస్తున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. డివిజన్‌లోని బాపునగర్‌లో గత కొన్ని రోజులుగా మురుగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం కార్పొరేటర్ సమస్యను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి మ్యాన్‌హోళ్లలో పేరుకుపేయిన వర్థాలను శుభ్రం చేసి సమస్య పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్పొరేటర్ వెంట స్థానిక బస్తీ వాసులతో పాటు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

– గోల్నాక, ఫిబ్రవరి 4

బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

దూసరి శ్రీనివాస్‌గౌడ్

అంబర్‌పేట, ఫిబ్రవరి 4 : సమగ్ర కుటుంబ సర్వే సరిగా చేయకుండా బీసీ జనాభాను తక్కువ చేసి బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేసిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కుల గణన సర్వేలో లక్షలాది కుటుంబాలను సర్వే చేయకుండానే బీసీ జనాభాపై స్పష్టత ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. ఇంకా 16 లక్షల మంది వివరాలు సేకరించలేకపోయామని చెప్తున్న సర్కారు తుది లెక్కలను ఎలా తేల్చారో చెప్పాలన్నారు. గతంలో చేసిన సర్వేలు, అంచనాల మేరకు రాష్ట్రంలో బీసీ జనాభా 60 నుంచి 62 శాతం ఉండాలని, కాంగ్రెస్ సర్కారు కేవలం 46.2 శాతం బీసీలు ఉన్నట్లు చూపడం బాధాకారమని పేర్కొన్నారు. సకల జనుల సర్వేకు ఇప్పుడు చేసిన సర్వేకు బీసీ జనాభా 21 లక్షలు తగ్గిందని చెప్పారు. జనాభా పెరగాలే కానీ తగ్గడం ఏంటో వారికే అర్థం కావాలని అన్నారు. బీసీల సంఖ్యను తక్కువగా చూపించి రిజర్వేషన్ శాతాన్ని తగ్గించాలని ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక అండ

ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక అండ లభిస్తుందని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. మంగళవారం కార్వాన్‌కు చెందిన లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీని ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడానికి అధికారులు నిరంతరం కృషి చేయాలని అన్నారు.

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 4

మళ్లీ ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల స్వీకరణ

జియాగూడ వార్డు కార్యాలయంలో దరఖాస్తులు ఇచ్చేందుకు క్యూలో నిల్చున్న మహిళలు

- ఎండలో చిన్నారులతో మహిళల పడిగాపులు
- ఇంతకు ముందు ఇచ్చిన దరఖాస్తులు ఏంచేశారు?
- మళ్లీ దరఖాస్తుల స్వీకరణ ఏంటని నిలదీత
- ప్రజలను ఇబ్బందులు పెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉందని పలువురి ఆగ్రహం
- ఒక్క దరఖాస్తుకు రూ.50, జిరాక్స్‌కు రూ.20, ఫాం నింపేందకు రూ.20 వసూలు
- జిరాక్స్ సెంటర్ల నిర్వాహకుల చేతివాటం
- అక్రమ వసూళ్లను పట్టించుకోని అధికారులు
- ఆవేదన చెందుతున్న పేదలు

అబిడ్/ జియాగూడ, ఫిబ్రవరి 4 : ప్రజాపాలన పథకాల కోసం నేటి నుంచి జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాల్లో అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తూన్నారు. మంగళవారం జియాగూడ డివిజన్ పరిధిలోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసేదుకు ఉం దయం నుంచి మహిళలు మండుటెండలో క్యూలో నిలబడక తప్పడం లేదు. అయితే ఇప్పటికే ప్రజాపాలన దరఖాస్తులు చేసిన వారి వివరాలు లేక పోవడంతో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున వార్డు కార్యాలయానికి వస్తుండటంతో, అక్కడ కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పిల్లలను తీసుకుకొని దరఖాస్తు చేసేందుకు వస్తున్న మహిళలు కనీసం సౌకర్యాలు లేవని ఇంతకు ముందు చేసిన దరఖాస్తులు ఏమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల అమ్మకం దందా.. అడ్డగోలుగా వసూలు ..

ప్రజాపాలన ధరఖాస్తు పాం ల కోసం జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో ఎటువంటి సమాచారం లేదని, ఫాం అడిగితే అధికారులు సమాధానం ఇవ్వడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూన్నారు. జియాగూడ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో లేని పాం లు పక్కనే గల జిరాక్స్ షాప్‌లలో లభ్యమవుతున్నాయని వాటిపై అధికారులు పంటించుకోవడం లేదని వాపోతున్నారు. ఒరిజినల్ ఫాం ఒక్కటి రూ.50, జిరాక్స్ అయితే రూ.20కి విక్రయిస్తున్నారని, ఫాం నింపడానికి రూ.20 వసూలు చేస్తున్నారన్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన దరఖాస్తులు మీసేవా కేంద్రాలు, జిరాక్స్ షాపులల్లో డబ్బులు పెట్టి కోనాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాటిపై అధికారులు దృష్టిపెటడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తులు ఉచితంగా ఇచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జియాగూడ వార్డు కార్యాలయంలో దరఖాస్తు చేసేందుకు వచ్చి ఎండలో చిన్నారితో వేచిఉన్న మహిళ

అబిడ్స్ : ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ సోమవారం నుంచి జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయాలలో స్వీకరిస్తున్నారు. గత సంవత్సరం దరఖాస్తు చేసుకోని వారు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో వారు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఐతే ప్రజా పాలనలో ఈ సారి మాత్రం కేవలం ఇందిరమ్మ ఇండ్ల కోసం మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తుండడంతో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని ప్రకటించి ఇప్పుడు మాత్రం కేవలం ఇందిరమ్మ ఇండ్ల కోసం మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్-14 కార్యాలయం పరిధిలోని ఆరు డివిజన్‌లలో ఈ దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నారు.

ప్రజా పాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

రేషన్ కార్డుల దరఖాస్తులను స్వీకరించాలి..

ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణలో రేషన్ కార్డుల దరఖాస్తులను కూడా స్వీకరించాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఆన్‌లైన్‌లోనైనా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇటీవల రేషన్ కార్డుల సర్వే సందర్భంగా దరఖాస్తులు లేని వారు ఆందోళన చేపడితే తిరిగి దరఖాస్తులను స్వీకరించడమే కాకుండా ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని చెప్పి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూ.4,500 కోట్ల ఫీ బకాయిలను విడుదల చేయాలి

ఫీజుల బకాయిలను విడుదల చేయాలని
ర్యాలీ నిర్వహిస్తున్న జాతీయ బీసీ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 4: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.4,500 కోట్ల ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ నాయకుల ఆధ్వర్యంలో ఫీజుల బకాయిలను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం చాదర్‌ఘాట్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మూడేండ్ల నుంచి ఫీజులు చెల్లించడంలేదని, బకాయిలు చెల్లించక పోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల కోర్సులు పూర్తి అయినప్పటికీ సర్టిఫికెట్లను ఇవ్వడంలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణ, ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్‌కర్, సత్యపాల్‌సింగ్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్ పాల్గొన్నారు.

లక్ష డప్పులు, వేల గొంతుకలు సభకు తరలిరావాలి

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి రవిమాదిగ

జియాగూడ, ఫిబ్రవరి 4 : లక్ష డప్పులు, వేల గొంతుకలు కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ డప్పులతో తరలిరావాలని నాంపల్లి నియోజకవర్గం పూజల్లోల్ల రవిమాదిగ అన్నారు. మంళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులతో కలిసి లక్షడప్పులు, వేల గొంతుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మల్లేపల్లి డివిజన్ బస్తీలలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌బీడీసీ అధ్యక్షుడు వై. సునీల్‌కుమార్, బీజేపీ మాజీ డివిజన్ అధ్యక్షడు జగనాథరాజు, కట్కూరి విష్ణు, సతీశ్‌మాదిగ, డప్పు కళాకారులు అశోక్‌మాదిగ, పి. శివశంకర్‌మాదిగ, లీలాధర్‌మాదిగ, శ్రీకాంత్, కిరణ్, సుదాకర్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కురాడి శ్రీనివాస్‌కు అభినందనల వెల్లువ

టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యదర్శిగా తనను నియమించినందుకు టీఎన్జీవో కేంద్ర సంఘం అ ధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కోశాధికారి బాలరాజ్, ఉపాధ్యక్షుడు ఉమర్‌ఖాన్‌లతో పాటు సెంట్రల్ యూనియన్ కార్యవర్గం, హైదరాబాద్ జిల్లా కార్యవర్గానికి కురాడి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గం, వివిధ యూనిట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, ఈఎన్‌టీ దవాఖాన యూనిట్ అధ్యక్షుడు తూముకుంట రాజు, నిహారిక, స్రవంతి గజమాలతో జిల్లా శాఖ అధ్యక్షుడు విక్రమ్‌కుమార్‌ను, కార్యదర్శి కురాడి శ్రీనివాస్‌లను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

– సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 4

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ఆమోదించి అమలు చేయాలి

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌చారి

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలోని అన్ని బార్‌అసోసియేషన్లకు చెందిన ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌చారి చేతులమీదుగా సివిల్ కోర్టుల ప్రాంగణంలో లాయర్స్ ఫోరం క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వాలు తక్షణమే ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రాల్ని అందించామని అన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీవర్గీకరణతో పాటు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రతిపాదించాలని అన్నారు. తెలంగాణలోని అన్ని బార్ అసోసియేషన్లకు చెందిన న్యాయవాదులపై దాడుల పరంపర కొనసాగుతున్నదని, చట్టాన్ని రూపొందిస్తే న్యాయవాదులకు ఉపశమనం లభిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్స్ ఫోరం అధ్యక్షుడు నర్రిస్వామీ కురుమ, సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి రమేశ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు వి.మధుసూధన్, సరితామిశ్రా, అశోక్ , సీనియర్ న్యాయవాదులు నాగభూషణం, హనుమంత్ పటేల్, పరుశురామ్ పాల్గొన్నారు.

గృహ నిర్బంధంలో అశీష్‌కుమార్‌యాదవ్

బీఆర్ఎస్ నాయకుడు అశీష్‌కుమార్‌యాదవ్‌ను గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు

అబిడ్స్, ఫిబ్రవరి 4 : అసెంబ్లీ సమావేశాల ప్రారంభాన్ని పురస్కరించుకొని పోలీసులు బీఆర్ఎస్ నాయకులను గృహనిర్బంధం చేశారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు అశీష్‌కుమార్ యాదవ్‌ను హిమాయత్‌నగర్‌లోని తన నివాసంలో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా అశీష్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నెరవేర్చ లేదన్నారు. తప్పుడు వాగ్ధానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఈ నెల 26వ తేదీ అర్ధ రాత్రి నుంచి రైతు భరోసా మొదలవుతుందని చెప్పి అది కూడా వేయలేదని విమర్శించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మెరిసిన విద్యార్థులు

విద్యార్థులతో కోచ్ హైదర్ అలీ

కార్వాన్, ఫిబ్రవరి 4 : మార్షల్ ఆర్ట్స్ తో శారీరక దృఢత్వం మెరుగుపడుతుందని పోక్ మార్షల్ ఆర్ట్స్ కోచ్ హైదర్ అలీ అన్నారు. ఇటీవల విశాఖపట్నంలోని రాజీవ్ గాంధీ పోర్ట్ ఇండోర్ స్టేడియంలో పోకో మార్షల్ ఆర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో భారత్, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక కు చెందిన దాదాపు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో నగరానికి చెందిర కోచ్ హైదర్ అలీ నేతృత్వంలోని పోకో మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు సయ్యద్ సకీనా ఫాతిమా, రోహిత్, సయ్యద్ అన్సార్, సోహైల్, రోహన్‌లు సిల్వర్ పతాకాలు సాధించగా వారిన ఘనంగా సన్మానించారు.

పుస్తకాలు ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సూర్య ధనుంజయ్

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 4 : రీసెర్చ్ ప్రాజెక్ట్ నివేదికల ద్వారా యూజీ పాఠ్యాంశాల్లో ప్రాక్టికల్ లెర్నింగ్‌ను చేర్చాలని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఒక రోజు వర్క్‌షాప్ ఒక విన్నూత్న అమలు ను చేపట్టింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ పాల్గొన్ని మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ నుంచి డాక్టర్ నజియా సుల్తానా, డాక్టర్ శైలజ రచించిన, బిజినెస్ ఎకనామిక్స్ నుంచి డాక్టర్ సబిహా సుల్తానా, డాక్టర్ శారదలు రచించిన ఎంటర్‌ప్రెన్యూరియల్ డెవలప్‌మెంట్ నుంచి డాక్టర్ బి శైలజ, డాక్టర్ రాజలక్ష్మి రచించిన మూడు పుస్తకాలను ఆమె ఆవిష్కరించారు. అంతే కాకుండా బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై ఎడిట్ చేసిన పుస్తకంతో పాటు డాక్టర్ డి మయూరి, డాక్టర్ సాయిలేఖ సంపాదకీయం చేసిన పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సరిత, డాక్టర్ రాజగోపాల్‌తో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు పనులు ప్రారంభం

విజయ్‌నగర్ కాలనీ డివిజన్ ఫిరోజ్‌గాంధీనగర్, జేబాబాగ్‌లలో వీడీసీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం జీహెచ్ఎంసీ సర్కిల్ -12 ఇంజినీరింగ్ అధికారులు ప్రారంభించారు. ఈ పనులను షేక్‌ఖాసీం పర్యవేక్షించారు.

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 4

పేకాట రాయుళ్ల అరెస్ట్

గోల్నాక, ఫిబ్రవరి 4: పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ డి.అశోక్ తెలిపిన ప్రకారం..అంబర్‌పేట డీడీకానీలో గత సోమవారం రాత్రి 11గంటల సమయంలో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు.. ఎస్సైలు మౌనిక, విజయ్ సిబ్బందితో కలిసి డీడీకాలనీలోని శ్రీ ఫ్రెష్ వెజిటేబుల్ మార్కెట్ వద్ద గల ఇంటిపై దాడులు నిర్వహించారు. దాడిలో పేకాట ఆడుతున్న దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డి, కృష్ణారావు, బి. సంతోష్, ఆనంద్, మూసారాంబాగ్ కు చెందిన ఉపేందర్, హబ్సిగూడకు చెందిన బి.రాజులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద రూ.22,260నగదుతో పాటు ప్లేకార్డులను స్వాధీనం చేసుకున్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

కాచిగూడ,ఫిబ్రవరి 4: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన సి.మహేశ్(19) సోమవారం రాత్రి ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

వెంకటాద్రి రైల్లో దొంగతనం

కాచిగూడ, ఫిబ్రవరి 4: వెంకటాద్రి రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా హైదర్షాకోట్, తిరుమలహిల్స్ ప్రాంతానికి చెందిన అలుమూరి సంధ్యారాణి(31)వెంకటాద్రి రైల్లో కాచిగూడకు వస్తుండగా షాద్‌నగర్ రైల్వేస్టేషన్‌లో బ్యాగు చూసుకు నేసరికి అందులో ఉన్న 131 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించారు. మంగళవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

అంబర్‌పేట, ఫిబ్రవరి 4: ఈ నెల 5వ తేదీన పలు ప్రాంతాలలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు తెలిపారు. లింగంపల్లి, నారాయణగూడ, బ్లడ్ బ్యాంక్, నృపతుంగ కళాశాల, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాలలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు కరెంటు ఉండదు.

ద బెస్ట్ అంకాలజిస్ట్ అవార్డుల ప్రదానం

ద బెస్ట్ అంకాలజిస్ట్ అవార్డులు అందుకున్న డాక్టర్లు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 4: క్యాన్సర్‌ను నిర్మూలించడమే కాకుండా వ్యాధి బారిన పడిన వారికి ఆత్మస్థైర్యం కల్పించాలని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్యధనుంజయ్ అన్నారు. మంగళవారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం దర్బార్‌హాల్‌లో తెలంగాణ సిటిజెన్స్‌కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె నగరంలో క్యాన్సర్ నివారణకు విశేషంగా కృషి చేసిన ప్రముఖ అంకాలజిస్ట్‌లు ప్రొఫెసర్ డాక్టర్ గీతా నాగశ్రీ, ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉమా కాంత్ గౌడ్, ప్రొఫెసర్ డాక్టర్ జి. జోసెఫ్ బెంజిమెన్‌లను కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్, కార్యదర్శి డాక్టర్ కేపీ హేమంత్‌కుమార్‌లతో కలిసి ద బెస్ట్ అంకాలజిస్ట్ అవార్డు 2025ను ప్రదానం చేసి శాలువాలతో సన్మానించారు. కేర్ హాస్పిటల్ హైటెక్ సిటీ డైరెక్టర్, అ సోసియేట్ క్లినికల్, సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ గీతనాగశ్రీ మాట్లాడుతూ మన దేశంలో 40 శాతం క్యాన్సర్ పొగాకు సేవించడం వలన వస్తుందని, 14 రకాల క్యాన్సర్‌కు కారణం అవుతుందని, పొగాకులో 80 రకాల క్యాన్సర్ కారకాలు ఉంటాయని అన్నారు. ఎంఎన్‌జే ప్రభుత్వ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, రీజినల్ సెంటర్ క్యాన్సర్ సెంటర్ సీనియర్ ప్రొఫెసర్, సర్జికల్ అంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఉమా కాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. తిన్నది అరగకపోవడం, గుండెల్లో మంట, రాత్రులు చెమట పట్టడం, గొంతు, ముక్కు నుంచి రక్తం కారటం, దగ్గు ఎక్కువ కాలం ఉండటం, ఆహారం మింగడానికి ఇబ్బంది పడటం, వాంతుల్లో రక్తం కనిపించడం, మూత్ర విసర్జన చేయడానికి ఇబ్బంది పడటం ఈ లక్షణాలన్నీ క్యాన్సర్ లక్షణాలని వివరించారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ అభివృద్ధి కౌన్సిల్ అడ్వైజర్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, డాక్టర్ కృష్ణాజీ రావు, డాక్టర్ దేవేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డి.యాదయ్య, ప్రముఖ వ్యాఖ్యాత వచన ప్రియా పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కేసరి నియామకం

కాచిగూడ, ఫిబ్రవరి 4: పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు అన్నారు. కాచిగూడలోని నింబోలిఅడ్డా ప్రాంతానికి చెందిన కేసరి నర్సింగ్‌రావు యాదవ్‌ను తెలంగాణ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మంగళవారం నియమితులైనారు.ఈ పదవి రావడానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి కృష్ణయాదవ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి, సీనియర్ నాయకుడు మూల రవీందర్‌గౌడ్‌కు నర్సింగ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచడం హర్షణీయం

రవీంద్రభారతి, ఫిబ్రవరి 4 : రాష్ట్రంలో కులగణన చేపట్టి ప్రభుత్వం దేశానికి మార్గదర్శకంగా నిలిచిందని ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ జోడోయాత్రలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి కులగణన చేపట్టారని తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీకి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు.

ప్రజాస్వామ్య విజయానికి సుపరిపాలన

విద్యార్థినులతో డాక్టర్ పి. మోహన్‌రావు

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 4 : మంగళవారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయంలోని ప్రమదా దేవి ఆడిటోరియంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి డాక్టర్ రజిని ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య విజయానికి సుపరిపాలన అనే అంశంపై